ఆ కష్టజీవి కన్నీళ్ళను
ఆ బూర్జువా రచయిత
ఎలా కాష్ చేసుకున్నాడు?

# మనిషిలోని మనిషి




సూర్యుడికి ఆ రోజు చాలాకోపంగా వుంది.

నిప్పులు కక్కుతూ ఆ కోపాన్ని భూమ్మీద ప్రజలపై చూపిస్తున్నాడు. సమయం పన్నెండు గంటలు దాటిందేమో ఎండ చాలా తీవ్రంగా వుంది. ఆ ఎండ తీవ్రతను భరించలేక జనమంతా ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అటువంటి సమయంలో అమలాపురం బస్టాండ్‌లో రాజమండ్రి నుండొచ్చిన ఎక్స్‌ప్రెస్ ఆగింది.

అందులో నుంచి కుటుంబ సమేతంగా అంటే భార్యా, ఇద్దరు పిల్లలు, రెండు సూట్‌కేసులతోసహా దిగాడు విశ్వమూర్తి. అతనొక ప్రముఖ రచయిత. మన రాష్ట్రంలో వున్న గొప్ప రచయితల్లో అతనొకడు. ఒక విధంగా చెప్పాలంటే ఆంధ్రుల ఆరాధ్య రచయిత అని చెప్పవచ్చును. అతనికి సామాజికస్పృహ వున్న రచయితగా మంచి గుర్తింపు వుంది. అతని రచనలన్నీ బడుగు ప్రజల జీవితాలను ప్రతిబింబించేవిగా వుంటాయి. అతను రచనలు చేసేటప్పుడు ఏయే వర్గాల ప్రజల గురించి వ్రాస్తాడో వాళ్ళ దగ్గరకుపోయి వాళ్ళలో కలిసి జీవించి వారి గురించి తెలుసుకుని వ్రాస్తాడని ప్రతీతి. అందుకే రచయితగా అంత పేరుంది. అంతేకాకుండా అతను రచయితగా బాగానే సంపాదించాడు. కాబట్టి ఆ సంపాదనలో కొంతభాగం విరాళాల రూపంలో ప్రకటిస్తాడు. ఆ విధంగా కూడా మంచి పేరు సంపాదించుకున్నాడు.

అతని సీరియల్స్ ఇప్పుడు అన్ని పత్రికల్లోను వస్తున్నాయి.

విశ్వమూర్తికి ప్రతి టౌనులోను అభిమా



నులున్నారు. వాళ్ళు అతనికి బ్రహ్మరథం పడతారు. అప్పుడప్పుడు వాళ్ళు పిలిస్తే అతిథిగా వెళ్ళి ఉపన్యాసాలిస్తాడు. అమలాపురంలో కూడా అతనికి అభిమానులున్నారు.

అతను వస్తున్నట్టు వాళ్ళకి తెలిసుంటే బస్టాండ్‌లో అతనికి బ్రహ్మాండమైన స్వాగతం లభించేది. అయితే అతనొక రచయితగా వస్తేనే వాళ్ళకి తెలియజేస్తాడు, సత్కారాలు

అందుకుంటాడు గాని, స్వంత పనుల మీదవస్తే మాత్రం వాళ్ళకి తెలియజెయ్యడు ఇప్పుడతనను బోడకుర్రులో జరగబోయే అతని బంధువులింట్లో పెళ్ళికి వస్తున్నాడు కాబట్టి అతని రాక అభిమానులకు తెలియజే యలేదు. ఆ రోజున్న ఎండ అంతకుముందు లేకపోవడంతో ఆ వేడికి తట్టుకోలేకపోతు న్నారు విశ్వమూర్తి కుటుంబ సభ్యులు. కౌంటర్‌లో బోడసకుర్రు వెళ్ళే బస్సు ఎన్ని గంటలకుందోనని కనుక్కుంటే రెండున్నర వరకు లేదన్నారు. బోడసకుర్రు అక్కడకు అయిదారు మైళ్ళుంటుంది. అంతవరకు ఇక్కడ వుండేకంటే ఏ ఆటోనో లేక రిక్షానో మాట్లాడుకుని పోతే బావుంటుంద ని అవుంటాయేమోనని చూసాడు. ఆటోల్లే వుగాని రెండు రిక్షాలు మాత్రం వున్నాయి. రిక్షా మాట్లాడుకుందామని వెళ్ళాడు. ఒక రిక్షావాడు పడుకుని వున్నాడు. వాణ్ణడిగితే ఈ ఎండలో రాలేనన్నాడు.

రెండో రిక్షా అతను ముసలివాడు. దగ్గర దగ్గరగా అరవై ఏళ్ళుంటాయి. పీక్కుపోయి న ముఖంతో వున్నాడు. అస్థిపంజరం లాంటి శరీరాన్ని చిరిగి, మాసిపోయిన గుడ్డలతో కప్పాడు.

భారతదేశ పేదరికానికి ప్రతిరూపంలా వున్నాడు.

అతన్నడిగితే వస్తానన్నాడు. పదిహేను రూపాయలిప్పించండన్నాడు. అంతా? అను కున్నాడు విశ్వమూర్తి. బస్సులో అయితే అయిదారు రూపాయలలో వెళ్ళిపోయేవారు. కాని ఇప్పుడు రిక్షావాడు ఎంత అడిగినా ఇచ్చిపోవలసిందే మరి. అయినా బేరమాడదా మనుకుని పది రూపాయలిస్తానన్నాడు.

"కిట్టదు బాబయ్యా. ఇంత ఎండలో అంత దూరం రిచ్చా తొక్కాలంటే మాట లు కాదు. పొద్దున్నుంచీ బేరాల్లేకగాని నేనూ రాకపోదును" అన్నాడతను.

ఇంక లాభం లేదు. డబ్బులు పోతే పోయాయనుకుని కుటుంబసమేతంగా రిక్షా ఎక్కాడు. అంతమందికి రిక్షా ఇరుగ్గా వుంది. రిక్షా అతను చాలా కష్టంగా లాగుతున్నాడు.

ఆ బరువుకి రిక్షా పెడల్ ఫట్‌ఫట్ మంటోంది.

అంత బరువున్న రిక్షా తొక్కడానికి కాళ్ళలో వున్న బలాన్నంతా ఉపయోగించేస రికి కాళ్ళలోని నరాలన్నీ వుబ్బుతున్నాయి. అంత ఎండలో అతను చమటలో తడిసి ముద్దయిపోయాడు. చాలా ఆయాసపడిపో తున్నాడు.

అతన్నిచూస్తే విశ్వమూర్తికి చాలా జాలి వేసింది.

అలాంటి వాళ్ళ గురించే అతను కథలు వ్రాసేది. అటువంటి వారి స్థితిగతులను తెలుసుకుని అతను బాధపడేవాడు. అందుకే ఇప్పుడు చాలా బాధపడుతున్నాడు. అతని రిక్షాలో కూర్చున్నందుకు. తప్పదు ఇప్పుడు ఇంతకన్నా గత్యంతరం లేదు.

రిక్షా గడియారం స్తంభం సెంటర్ దాటింది. చాలా నెమ్మదిగా పోతోంది. రిక్షాలో బరువు కూడా తక్కువేం కాదు. నిజంగా డబ్బుల కాసపడి కాకపోతే అంత ఎండలో అంత బరువున్న రిక్షాను తొక్కడం సామాన్యమైన విషయం కాదు.

డబ్బు అతనికెంత అవసరమో అనుకు

న్నాడు విశ్వమూర్తి.

ఎంతో అవసరం కాకపోతే ఇంత ఎండ లో రిక్షా తొక్కడు.

అతని అవసరమేమిటో తెలుసుకుంటే?

తను ఇలాంటి వారి గురించే తెలుసుకుని కథలు వ్రాస్తాడు.

మరి ఇతని గురించి తెలుసుకుని కథ వ్రాస్తే? ఒక మంచి కథ అవుతుంది. ఎలా అయినా సరే అతని గురించి తెలుసుకోవాల నుకున్నాడు.

''తాతా నీదీ ఊరేనా?'' అంటూ ప్రారంభించాడు.

''కాదు బాబయ్యా. ఏమారం (వేముల వరం) మా ఊరు'' అన్నాడతను.

''ఈ వయస్సులో నువ్వు రిక్షా తొక్కు తున్నావేం?''

''పొట్ట గడవాలిగా బాబూ!''

''నువ్వు తప్ప ఇంకెవరూ లేరా మీ ఇంట్లో రిక్షా తొక్కడానికి''

''లేరు బాబూ. వుంటే నేనెందుకు తొక్కుతాను. అంత అదురుష్టం నాకు లేకుండా చేసాడా బగమంతుడు'' అతని గొంతు బొంగురుపోయింది. దుఃఖాన్ని దిగమింగుకున్నాడతను.

ఇతనికేదో గతముంది. అది తప్పక తెలుసుకోవాలనుకున్నాడు విశ్వమూర్తి.

''బాధపడుతున్నావేం తాతా'' అన్నాడు మళ్ళీ.

''బాదపడకేం సెయ్యాలి బాబూ. కష్టాలన్నీ నాకే రాసాడా దేముడు. అవన్నీ అనుబవించడానికే బతికున్నానేమో. నేను సత్తెగాని సుకపడలేను. అంతదాకా నేనిలా కట్టుబడవలసిందే బాబూ'' అన్నాడతను.

ఇప్పుడేం అడిగినా చెప్పేటట్లు లేదు. కాస్సేపాగి అడుగుదామనుకున్నాడు.

రిక్షా భానోజీ రామర్స్ కాలేజి దగ్గరకొచ్చింది.

రిక్షాలో కూర్చున్నవాళ్ళే ఎండకు తట్టుకోలేకపోతున్నారు.

## స్పేస్‌లో పోస్టాఫీస్



అంతరిక్షంలో పోస్టాఫీసును ప్రారంభించిన ఘనత గతకాలపు సోవియట్ యూనియన్‌కు దక్కింది. నవంబర్ 26, 1988నాడు మొదలుపెట్టబడిన ఈ పోస్టాఫీసును వ్లాదిమిర్ 'టిటోవ్', పోస్టాఫీస్ ప్రముఖుడిగా పనిచేసారు. ఈ పోస్టాఫీసు ఉన్న మిర్ కాంప్లెక్స్ అనబడే అంతరిక్ష నౌకను రష్యా, ఫ్రెంచ్ దేశస్థులు సంయుక్తంగా పనిచేసారు.

— సాయి

ఇంక రిక్షా అతని సంగతి చెప్పనక్కరలే దు.

రిక్షా అలా నెమ్మదిగా ముందుకు పోతోం ది.

రిక్షా పేరూరు జంక్షన్ దగ్గరకొచ్చేసరికి నాలుక పిడచకట్టుకుపోయినట్లయింది అంద రికీ. ఏదన్నా త్రాగాలనిపించింది. జంక్షన్‌లో వున్న సోడా షాపు దగ్గర ఆపించాడు రిక్షాను. పిల్లలిద్దరూ కూల్ డ్రింక్స్ తాగారు. తనూ, భార్య ఐస్ సోడాలు తాగారు. రిక్షా అతనికి మామూలు సోడా ఇప్పించాడు విశ్వమూర్తి.

అతను సోడా సగం తాగి మిగిలిన నీళ్ళతో ముఖం కడుక్కున్నాడు.

''బలే ఏడిగా వున్నాయి నీల్లు'' అన్నాడు సీసాను షాపువాడికిస్తూ.

''మామూలు సోడా ఏడిగా వుండక కూలింగుంటదనుకున్నావేంటి'' అన్నాడు షాపువాడు నవ్వుతూ.

''పాపం అతనికీ కూలింగ్ సోడా ఇప్పిం చవలసిందండీ'' అంది భార్య. విశ్వమూర్తేం మాట్లాడలేదు.

రిక్షా కదిలింది.

''అవునూ ఇంతకీ నీ పేరేంటి?''

''గంగులంటారయ్యా''

''మాడు గంగులూ అడుగుతున్నానని ఏమీ అనుకోకు. ఇంత ముసలి వయస్సులో కూడా నువ్విలా రిక్షా తొక్కుతున్నావంటే నాకు చాలా బాధగా వుంది. కుటుంబంలో ఎంతో అవసరం వుంటేనే గాని ఇలా ఎవరూ చెయ్యరు. నీకెవరూ లేరా? ఆ మాటడిగితే ఇందాక నువ్వు చాలా దుఃఖపడ్డా వు. ఏం జరిగిందో చెప్పకూడదూ'' అంటూ చాలా జాలిగా అడిగాడు.

ఆ మాటలకు రిక్షావాడు బాగా కదిలిపోయాడు.

''ఏం చెప్పమంటావు బాబూ. ఇదంతా నా కర్మ. చెట్టంత కొడుకును దేవుడు అన్యాయంచేసి తీసుకుపోయాడయ్యా. అప్ప ట్నించీ నాకీపాట్లు తప్పడంలేదు'' అన్నాడు ఏడుస్తూ.

''ఎలా చచ్చిపోయాడు''

''నాకో కూతురు, కొడుకూ బాబూ. ఆడు రిచ్చా తొక్కి మా అందరికీ ఇంత కూడు పెట్టేవాడు. ఓ రోజు రాత్రి సెకండాట సినిమా వదిలాక బేరం తగిలితే ముత్తేసరం (ముక్తేశ్వరం) కట్టాడంట బా బూ. అసలే ఆ రోడ్డు బాగోదు. తాగున్నాడే మో ఓ లారీ వాడొచ్చి రిచ్చాను గుద్దేసాడంట . రిచ్చా రోడ్డు పక్కకి, యీడు లారీ కింద పడిపోయాడు. అక్కడికక్కడే సచ్చిపోయా డు బాబు. ఎవరైనా తాము పోతూపోతూ కుటుంబాన్ని సూడమని కొడుకులకి ఏమైనా ఆస్తులిచ్చి పోతారు కాని నా కొడుకు తను పోతూ తన వాళ్ళని ఆదుకోమని నాకిదిచ్చిపో యాడు బాబూ. నేను రోజూ దీన్ని లాగి నాలుగు డబ్బులు సంపాదిత్తేనేగాని నా కుటుంబం గడవదు. అందుకే ఈ వయసు లో ఈ తిప్పలు'' అన్నాడు.

''మరి నీ కొడుక్కి పిల్లలు లేరా?''

''ఎందుకు లేరు బాబూ. ఇద్దరు కొడుకులు — ముగ్గురు కూతుళ్ళు. మగపిల్ల లిద్దరూ ఎందుకూ పనికి రానోల్లయిపోయా రయ్యా. పెద్దోడు చిల్లర దొంగతనాలు చేస్తూ దొంగోడయ్యాడు. నాల్రోజులు బ

యటుంటే నాల్రోజులు జైల్లో వుంటాడు. రెండోవాడు జల్సాలు మరిగి ఇంటి పట్టును ఒడక ఎక్కడెక్కడో తిరుగుతుంటాడు. ఆడపిల్లలు సిన్నోళ్ళు. నా కోడలు మొగుడు పోయాక రోగిష్టిదయిపోయింది బాబూ. ఇంట్లో గడవటానికి, దాని మందులకు దీని మీదే సంపాదించాల బాబూ''

''చాలా కష్టపడుతున్నావు గంగులూ'' అన్నాడు విశ్వమూర్తి.

''అవే అయితే పర్వాలేదయ్యా. ఇప్పుడు మళ్లీ కొత్త బాధలొచ్చిపడ్డాయి. నా కూతుర్ని రాజోలిచ్చాను బాబు. దానికిద్దరు ఆడపిల్లలు

అక్కడ నా అల్లుడు కూడా రిచ్చా తొక్కేవాడు. ఆడు మొదట్లో బాగానే వుండేవాడు బాబూ. తర్వాత్తర్వాత తాగుడికి అలవాటుపడ్డాడు. రోజూ తాగొచ్చి నా కూతుర్ని తన్నేవాడంట. అదింతకాలం ఎలాగో వోర్సుకుంది. పెళ్ళికెదిగిన కూతుళ్ళున్నాక కూడా ఆడు దేన్నో వుంచుకున్నాడు. దాన్ని పెళ్ళాడతానని నా కూతుర్ని పిల్లలతో ఇంట్లో నుంచి పొమ్మన్నాడంట. ఇది అలాగే వుండేదట. ఓ రోజున వుంచుకున్న దాన్ని పెళ్ళాడి ఇంటికి తీసుకొచ్చి నా కూతుర్ని బయటకు పొమ్మన్నాడంట. ఇది అక్కడ నుంచి కదల్నంటే కత్తితో పొడవబోయాడంట. ఇది బయపడిపోయి పిల్లలతోపాటు నా దగ్గరకొచ్చేసింది బాబూ. ఏమైనా సరే ఇంకెల్లనంటుంది. ఆల్లని కూడా నేనే పోషించాల. ఇవి సాలక ఇంకో పెద్ద కష్టమొచ్చిపడింది బాబూ...'' అంటూ ఆగాడు. మళ్ళీ అతనే చెప్పడం ప్రారంభించాడు.

అదేమిటని విశ్వమూర్తి అడగలేదు.

''... నా మనవరాలు అంటే కూతురు కూతురికి పెళ్ళిసేద్దామని అల్లారంలో (అల్లవరం) ఓ సంబందం సూసానయ్యా. కుర్రాడా వూళ్ళో కూలిపనులు సేసుకుంటున్నాడంట. సరే ఏదోలా పెళ్ళి సేద్దామని అదీ ఇదీ కూడగట్టుకున్నాను. ఈలోగా నా మనవరాలు కొంప ముంచింది బాబూ. మరి



ఎవడితో తిరిగిందో కడుపు తెచ్చుకుంది. లక్ష్మి కూతుళ్ళిద్దరూ సత్తామని ఏడుత్తుంటే దాని కడుపు తీయించేద్దామని ఆసుపత్రిక్కి తీసుకొచ్చాను బాబూ. ఆ డాక్టరు కడుపు తియ్యడానికి అయిదొందలు అవుతుందన్నాడు. అప్పోసప్పో సేద్దామని సరే అన్నాను. బాగా నెలలు నిండిపోయాయంట. మరాడేం సేసాడో దీని పేనం మీదకొచ్చింది. ఎలా అయితే ఇంకో అయిదొందలు మందుల కోసం కర్చుపెడితే అది బతికి బయటపడింది. ఆ అప్పు ఇంకా అలాగే వుంది బాబూ. వడ్డీలు మాత్రం పెరిగిపోతున్నాయి. నేను సచ్చేలోగా తీరుత్తాదో లేదో. ఇలా సెప్పుకుంటుంటే మా కష్టాలకు అంతులేదయ్యా. మా అందరి బతుకులింతే'' అన్నాడు రిక్షా గంగులు కళ్ళు తుడుసుకుంటూ.

ఆ కథంతా విన్న విశ్వమూర్తికి చాలా జాలి కలిగింది. ఒక విధంగా చెప్పాలంటే అతని మనస్సు కలచివేసింది. అతను వ్రాసిన కథలన్నీ ఒక ఎత్తయితే ఈ కథ ఇంకొక ఎత్తు. ఇది కథగా కాదు గంగులు కుటుంబం లోని అందరి వ్యక్తుల్ని తీసుకుంటే ఒక పెద్ద నవల వ్రాయొచ్చు. ముందో వీక్లీకి సీరియల్ గాను తర్వాతో పబ్లిషర్‌కి ఇస్తే తనకి మంచి పేరుతోపాటు డబ్బు కూడా బాగా వస్తుంది.

విశ్వమూర్తి విశాఖపట్నంలో ఓ పెద్ద ఆఫీసులో మంచి ఉద్యోగమే చేస్తున్నాడు. అతని సంపాదన కూడా బాగానే వుంది. పత్రికలవాళ్ళు, పబ్లిషర్లు ఇచ్చిన డబ్బులతో ఓ సెకండ్‌హాండ్ కారు కూడా కొనుక్కున్నాడు. త్వరలో ఇల్లు కట్టుకునే ఆలోచనలో కూడా వున్నాడు. కారు రిపేరు కెళ్ళింది కాని లేకపోతే ఈ పెళ్ళికి కారులోనే వచ్చేవాడు. ఉదయమే రైల్లో బయలుదేరి రాజమండ్రి తొమ్మిది గంటలకల్లా వచ్చేసారు. అక్కడ నుంచి బస్సులో అమలాపురం చేరేసరికి మంచి ఎండ వచ్చేసింది.

రిక్షా స్పీడు కొంచెం తగ్గింది. గంగులు తొక్కలేక ఒగురుస్తున్నాడు.

"రోజూ రిక్షా లాగి డబ్బు లట్టుకెళ్ళకపోతే ఆ రోజు కూడుండదు బాబూ. అంతా నేను తెచ్చే డబ్బులు కోసం ఎదురుసూత్తా వుంటారు. ఏరోజు కారోజు అయిపోతుంది. రోజూ ఇరవై రూపాయలుంటే గాని గడవదు. ఆ డబ్బులొచ్చేవరకు ఎంతాలిసం అయినా రిచ్చా తొక్కాలి బాబూ. పొద్దున్న సద్దన్నం తిని బయలుదేరతాను. మల్లీ సాయంకాలమే డబ్బులట్టుకుని ఇంటికెలతాను. రోజులన్నీ ఇలాగే గడిచిపోతున్నాయి. నాకీ మధ్య సూపు కూడా తగ్గిపోయింది బాబూ. దూరంగా వుండేవి సరిగ్గా అగుపడటం లేదు. ఈ రిచ్చా కూడా ఎంతోకాలం తొక్కలేనేమో. నా బాదల్లా ఒకటే బాబూ నేను సత్తే ఆల్లంతా ఎలా బతుకుతారా అని. ఏం జెయ్యగలం అన్నింటికీ ఆ బగమంతుడే వున్నాడు'' అంటూ ముగించాడు.

విశ్వమూర్తి ఓ నిశ్చయానికొచ్చాడు.

వెళ్ళిన వెంటనే అతనికి కడుపునిండా భోజనం పెట్టించాలని, ఆ రోజుకి అవసరమైన ఇరవై రూపాయలు ఇవ్వాలని. అతనడిగిందానికి ఓ అయిదు రూపాయలెక్కువిస్తే తనకొచ్చే నష్టం ఏమీ లేదు. ఇదంతా ఒక నవలగా వ్రాసి తను బాగానే సంపాదిస్తాడు. ఇతని రిక్షా ఎక్కడం ఎంత మంచిదయింది.

ఓ నవలకు మంచి ప్లాట్ దొరికింది.

రిక్షా గమ్యస్థానం చేరింది.

పెళ్ళివారిల్లు సందడిగా వుంది. అంతా రిక్షా దిగారు.

ఎవరో వచ్చి సూట్‌కేసులు తీసుకువెళ్ళారు.


విశ్వమూర్తి భార్యాపిల్లలు అక్కడ నుంచి కదిలి ఇంట్లోకి నడిచారు. గంగులు చెమటపట్టిన తన శరీరాన్ని చిరిగిన తుండులో తుడుచుకుంటున్నాడు. అతనికి డబ్బులిద్దామని విశ్వమూర్తి జేబులో నుంచి బయటకు తీసాడు. వందలు, ఏబయిలు, ఇరవైలు, పదులు వున్నాయి. అందులో ఒక అయిదు రూపాయల నోటు కూడా వుంది. దాన్ని చూసేసరికి ఉదయం వైజాగ్‌లో బయలుదేరి అమలాపురంలో బస్సు దిగేవరకు జరిగిన సంఘటనలు గుర్తుకొచ్చాయి.

ఉదయం ఇంటి నుంచి ఆటోలో స్టేషన్‌కొచ్చి ఆటోవాడికి రెండు అయిదులిస్తే అందులో ఒకటి మారదని తిరిగి ఇచ్చేసాడు. అప్పుడు చూసుకున్నాడు దాన్ని. అది కొంచెం మాసి వుంది. మధ్యలో చిరిగిపోతే **కాగితంతో** అతికించి వుంది. నెంబరు కూడా సరిగ్గా కన్పించడంలేదు. ఎలా వచ్చిందో మరి తను చూసుకోకుండా తీసేసుకున్నాడు. ఎలాగైనా దాన్ని మార్చెయ్యాలనుకున్నాడు. రైలు టికెట్లు కొన్నప్పుడు ఇస్తే కౌంటర్‌లో తీసుకోలేదు. రైల్లో కూల్‌డ్రింక్స్ తాగినప్పుడిస్తే వాడు మారదన్నాడు. రైలు దిగి బస్టాండ్‌కి రిక్షాలో వెళ్ళినప్పుడు రిక్షావాడికిస్తే వాడు తీసుకోలేదు. బస్సులో కండక్టర్ కిచ్చినా తీసుకోలేదు.

రావులపాలెంలో బస్సాగినప్పుడు సోడాలు తాగి ఆ నోటిస్తే సోడాలమ్మే కుర్రాడు చెల్లదని తిరిగిచ్చేసాడు. ఎంత ప్రయత్నం **చేసినా దాన్ని మార్చలేకపోయాడు.**

**అప్పటినుంచీ అతనికి బాధగానే వుంది. దాన్ని మార్చలేకపోయానే** అని.

రిక్షా వాడికి డబ్బులివ్వడానికని ముందు అనుకున్నట్లుగా రెండు పది రూపాయల



## సెన్సార్

"...!?"

మీనా గిరిజని ఆశ్చర్యంగా అడిగింది "కామాక్షికి పెళ్ళయి ఆరేళ్ళయినా ఇంకా పిల్లలు పుట్టలేదేంటి?"
'వాళ్ళాయన సెన్సార్ ఆఫీసర్ లే?!''

ఎ.ఉష్వారం (సికింద్రాబాద్)

నోట్లు తీసాడు.

అప్పుడు అతనిలో వున్న మరో మనిషి బయటకొచ్చాడు.

'రిక్షా వాడడిగింది పదిహేను రూపాయలయినప్పుడు ఇరవై ఇవ్వడం ఎందుకు? అసలు రిక్షాకి పది రూపాయలకన్నా ఎక్కువ ఇవ్వడం అనవసరం. మాట్లాడుకున్నారు కాబట్టి పదిహేను రూపాయలివ్వాలి. అటువంటప్పుడు పది రూపాయలకి ఈ అయిదు కూడా ఇస్తే అతనడిగిన పదిహేను ఇచ్చినట్లుంటుంది. ఆ అయిదు రూపాయలు మారినట్లుంటుంది. అతనికి సరిగ్గా కన్పించదు కాబట్టి అది మారదని అతనికి తెలియదు.


పది రూపాయల మధ్య అయిదు రూపాయలు పెట్టి గంగులు చేతికిచ్చి "మూసుకో గంగులూ పదిహేను రూపాయలు" అన్నాడు విశ్వమూర్తి. అతనెక్కడ చూసుకుంటాడోనని ఒక్క పక్క భయపడుతూనే వున్నాడు

"మూసుకోకపోతే ఏం బాబూ మీరేమన్నా తక్కువిత్తారేంటి" అని ఆ కాగితాల్ని మడత పెట్టుకుని జేబులో పెట్టుకున్నాడు గంగులు. 'హమ్మయ్య' అనుకున్నాడు విశ్వమూర్తి. అతనికి భోజనం పెట్టిస్తే ఈలోగా ఆ నోటునెక్కడ చూసుకుంటాడోనని ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

ఆ రోజుకు కావలసిన మిగిలిన అయిదు రూపాయలు సంపాదించుకోవడానికి రిక్షా వెనక్కి తిప్పాడు గంగులు.

అయిదురూపాయలు ఎలాగైతే మార్చగలిగాననే ఆనందంతో లోపలికి నడిచాడు ప్రముఖ రచయిత విశ్వమూర్తి.

*



డిజైన్: స్నేహసుధ (విశాఖపట్నం)